క్లుప్తంగా

424 మందికి వైద్య సేవలు



సత్తెనపల్లి: నందిగామ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష 2.0 వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఎస్‌వీఎస్ సాయి తేజారెడ్డి, డాక్టర్ దీప్తిషాలిని, డాక్టర్ రవిశంకర్‌రెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మొత్తం 424 మంది ఓపికి హాజరై పరీక్షలు చేయించుకొని మందులు పొందారు. ఆప్తామాలిక్ అసిస్టెంట్ వీరాంజనేయనాయక్ 34 మంది కంటి పరీక్షలు నిర్వహించి, 24 మందికి కళ్లజోళ్లకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకురాలు జె.సంపూర్ణ, పంచాయతీ కార్యదర్శి సీహెచ్.శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సుభాని



సత్తెనపల్లి: ఎస్టీయూ ఏపీ రాష్ట్ర అసోసియేటెడ్ అధ్యక్షుడిగా పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన ఉపాధ్యాయుడు ఎస్‌ఎమ్.ఎం.సుభాని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన నియామకం పట్ల పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్‌వీ.రామిరెడ్డి, యు.చంద్రజిత్ యాదవ్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏఐటీయూసీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రారంభమైన టెన్త్ ప్రీ-ఫైనల్ పరీక్షలు



సత్తెనపల్లి: పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం ప్రీ ఫైనల్ పరీక్షలను నిర్వహించారు. మండలంలోని వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాలలు, గురుకుల విద్యాలయం, కస్తూర్బా గాంధీ పాఠశాలలో మొత్తం 1,396 మంది విద్యార్థులకు గాను 1,381 మంది పరీక్షలకు హాజరయ్యారు. 15 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు ప్రశాంతంగా పరీక్షలు జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు.

మాదలలో బేటి బచావో- బేటి పఢావో కార్యక్రమం



మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ సిబ్బంది బేటి బచావో-బేటి పఢావో కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. సీడీపీవో శ్రీలత విద్యార్థినులకు లింగ వివక్షత, వ్యక్తిగత పరిశుభ్రత, బంగారు తల్లి, బాలికల అక్రమ రవాణా తదితర అంశాలపై వివరించారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. పాఠశాల ప్రిన్సిపల్ మిరియాల వెంకటేశ్వరరావు, ఏసీడీపీఓ సంతోషి కుమారి, సూపర్‌వైజర్ అనంతలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంది కొనుగోళ్లు ప్రారంభం



నకరికల్లు: రైతు భరోసా కేంద్రాల్లో కంది కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు జిల్లా రైతు శిక్షణా కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి తెలిపారు. కంది కొనుగోలు విధి విధానాలు వివరిస్తూ గుండ్లపల్లి గ్రామంలోని రైతులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. క్వింటా కందికి రూ.9,755లు మద్దతు ధర కల్పించినట్లు తెలిపారు. ఈ-క్రాప్ నమోదు చేసుకుని, ఈ-కేవైసీ పూర్తిచేసుకున్న రైతుల నుంచే కంది పంట కొనుగోలు చేస్తామన్నారు. నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా కంది కొనుగోలు చేసి, వారం రోజుల్లోపు రైతు ఖాతాలో నగదు జమ చేస్తారని చెప్పారు. మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, వీఏఏ ఎం.ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లలితాంబ చండీహోమం

మాచర్ల: పట్టణంలోని పత్తి ఫ్యాక్టరీ ఆవరణలో వేంచేసియున్న సత్యసాయి బాబా దేవాలయ ప్రాంగణంలో లలితాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సహస్రనామ పారాయణ కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు కొత్తమాసు వీరాంజనేయులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చండీ హోమం నిర్వహించారు. అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. నేడు (శనివారం) అమ్మవారి ఉత్సవాలలో భాగంగా కుంకుమార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మరో 38 రోజులే గడువు

- పన్నులు చెల్లింపునకు మార్చి 31వరకు గడువు
- ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను వసూళ్లలో ముందంజ
- నీటి పన్ను వసూలులో కానరాని ప్రగతి



పట్టణంలోని భవన సముదాయాలు

సత్తెనపల్లి: స్థానిక సంస్థలకు పన్నుల రూపంలో వచ్చే ఆదాయం ఎంతో కీలకం. పట్టణాభివృద్ధికి ఈ నిధులు సమకూర్చుకోవడం ప్రాధాన్యతాంశం. ప్రతి ఏడాదీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ రూపాల్లో నిధులు మంజూరు చేస్తున్నా .. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకొని ఖజానాను నింపుకోవడం కీలకమనే చెప్పాలి. అలా ఆదాయాన్ని సమకూర్చుకున్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గడిచిన 57 నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల ద్వారా పట్టణ రూపురేఖలు మారాయి. రోడ్లు, కాలవలు, కల్వర్ట్‌ల నిర్మాణాలు గతంలో ఎన్నడూ లేని విధంగా జరిగాయని చెప్పడంలో సందేహం లేదు. ఇదే క్రమంలో వివిధ రూపాల్లో రావాల్సిన పనుల ఆదాయం సకాలంలో చెల్లింపులు జరిగితే మరింత అభివృద్ధి సాధ్యపడుతుందన్న భావనను అధికారులు వ్యక్తం చేస్తున్నారు.

మొండిబకాయిలపై దృష్టి సారించేనా..

సచివాలయ వ్యవస్థ ద్వారా పన్నుల పన్ను వసూళ్లు మెరుగు పడ్డాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆశించిన స్థాయిలో పన్నుల వసూలు జరిగినప్పటికీ .. గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో పేరుకుపోయిన మొండి బకాయిల వసూళ్లలో యంత్రాంగం విఫలమవుతోంది. దీంతో ఆస్తి పన్ను రూపంలో రూ. 83.20 లక్షలు, ఖాళీ స్థలాల పన్నుల రూపంలో రూ.17.25 లక్షలు, నీటి పన్ను రూపంలో రూ.1.07 కోట్లు బకాయిలు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. పేరుకుపోయిన బకాయిలు రాబడితే పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుంది.

పురపాలక సంఘంలో ఇదీ పరిస్థితి

సత్తెనపల్లి పురపాలక సంఘ పరిధిలో 15,834 అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.4.69 కోట్ల ఆదాయం పన్నుల రూపంలో రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.2.66 కోట్లు వసూలు చేశారు. మరో రూ.2.03 కోట్లు రావాల్సి ఉంది.

- గడిచిన ఆర్థిక సంవత్సరాల్లో వసూలు కాని మొండి బకాయిలు రూ.96.05 లక్షలు ఉంది. ఇప్పటి వరకు రూ.12.85 లక్షలు వసూలు చేశారు. మరో రూ.83.20 లక్షలు వసూలు కావాల్సి ఉంది.
- అదేవిధంగా ఖాళీ స్థలాల పన్నుకు సంబంధించి 909 అసెస్‌మెంట్లు ఉండగా... ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 20 లక్షల డిమాండ్ ఉంది. ఇప్పటి వరకు రూ. 7.18 లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ.12.8.2 లక్షలు వసూలు కావాల్సి ఉంది. గడచిన ఆర్థిక సంవత్సరంలో రూ.25.14 లక్షలు రావాల్సి ఉండగా... ఇప్పటి వరకు రూ.7.89 లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ. 17.25 లక్షలు రావాల్సి ఉంది.
- తాగునీటి పన్నుకు సంబంధించి 7,800 అసెస్‌మెంట్లు ఉండగా... వాటి ద్వారా రూ.93 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటివరకు రూ.33 లక్షలు వసూలు చేశారు. ఇంకా రూ. 60 లక్షలు వసూలు కావాల్సి ఉంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో వసూలు కాని మొండి బకాయిలు రూ.1.32 కోట్లు ఉండగా... ఇప్పటి వరకు రూ. 25 లక్షలు వసూలు అయ్యాయి. ఇంకా రూ.1.07 కోట్లు వసూలు కావాల్సి ఉంది.

మార్చి 31లోగా పన్నులు చెల్లించాలి



పట్టణంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భవనాలు, ఖాళీ స్థలాలు, నీటి, అద్దె దుకాణాల ద్వారా రావలసిన పన్నులు చెల్లించేందుకు సమయం దగ్గర పడుతోంది. మార్చి 31 లోగా సంబంధిత యజమానులు నిర్ణీత పన్ను మొత్తాన్ని చెల్లించాలి. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ప్రజలంతా సహకరించి పన్నులు చెల్లించడం ద్వారా పట్టణాభివృద్ధికి సహకరించాలి.

– కొలిమి షమ్మి, మున్సిపల్ కమిషనర్, సత్తెనపల్లి.

దేవాలయాల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- మూడు దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ధర్మకర్తల మండలి సభ్యులతో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి కృషిచేస్తున్నామని, వాటి ఆదాయ వనరులు కూడా మెరుగుపరుస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని వేణుగోపాల స్వామి దేవాలయ కల్యాణ మండపంలో శుక్రవారం జరిగిన మూడు దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సభ్యులతో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారి తమ్మా సత్యన్నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఐదులాంతర్ల సెంటర్లో గల శ్రీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవాలయం, అచ్చంపేటరోడ్డులోని కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయం, వడ్డవల్లిలోని వీరాంజనేయ స్వామి దేవాలయాల ధర్మకర్తల మండలి సభ్యులకు మంత్రి అభినందనలు తెలిపారు. సమష్టి కృషితో ఆలయాల ఆధ్యాత్మిక అభివృద్ధికి సహకరించాలన్నారు. రాజుపాలెంలోని నేతి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ నుంచి రూ. 2 కోట్లు, ఏకో టూరిజం నుంచి కేంద్ర ప్రభుత్వ గ్రాంట్ మరో రూ. 2 కోట్ల నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆర్య వైశ్య ప్రముఖులు, పెద్దలు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. మంత్రి అంబటి రాంబాబును గజమాలతో సన్మానించారు. ముందుగా మంత్రి అంబటి రాంబాబుకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశీవిశ్వేశ్వర స్వామి దేవాలయానికి బచ్చు వీర వెంకట మురళీకృష్ణ, భవనం సీతా మహాలక్ష్మి, విప్పర్ల ఆదిలక్ష్మి, కొమ్మూరి వెంకాయమ్మ, అంకాళ్ళ ప్రభుదాస్, ధనావత్ లక్ష్మీబాయి, చదలవాడ సుబ్రమణ్యశర్మ, శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయానికి రావిక్రింది లక్ష్మీనీలవేణి, మున్నంగి సాంబశివరావు, మద్దిబోయిన సుమలత, కేతావత్ నాగరాజునాయక్, శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయానికి రావిక్రింది వెంకట మల్లికార్జునరావు, అంచుల కలిదుర్గా, గరికపల్లి రాజ్యలక్ష్మి, సంకుల లక్ష్మీతిరుపతమ్మ, అంకాళ్ళ కోటేశ్వరి, రమావత్తు హరిత ధర్మకర్తల మండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు సూరిబాబు, సాంబశివరావు, బాబురావు, పురుషోత్తమ రావు, శివప్రసాద్, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

సంత్ గాడ్గే బాబాకు ఘన నివాళి



సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సత్తెనపల్లి: స్వచ్ఛ భారత్ పితామహుడు సంత్ గాడ్గే బాబా 149వ జయంతి బీసీ సంఘ నాయకుడు పిల్లికతుపుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జీఓ హోమ్ సెంటరులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సంత్ గాడ్గే బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురువు, సంత్ గాడ్గే బాబా చరిత్రలో పరిశుభ్రతే దైవమని భావించిన తొలి సంఘసంస్కర్త అని కొనియాడారు. చీపురుతో వీధులను, కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడు సంత్ గాడ్గే బాబా అని కొనియాడారు. ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పిన పర్యావరణ వాది, తన యావద్ జీవితాన్ని సమాజానికి అర్పించిన సర్వసంగ పరిత్యాగి సంత్ గాడ్గే బాబా అని పేర్కొన్నారు. ఆయన జీవిత చరిత్ర నేటి, రేపటి యువతరానికి స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘ నాయకులు తుళ్ళూరి శివరామకృష్ణ, గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, చింకా అంకమ్మరావు, పులహోరి బానోజి, ఛావల వెంకటేశ్వర్లు, షేక్ చిన్న షరీఫ్ పాల్గొన్నారు.

రాష్ట్ర కాపు కార్పొరేషన్ నూతన డైరెక్టర్ మంగిశెట్టి



కోటేశ్వరరావుకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు మంగిశెట్టి కోటేశ్వరరావును రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. శుక్రవారం గుంటూరులోని తన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నియామక ఉత్తర్వులను మంగిశెట్టి కోటేశ్వరరావుకు అందజేశారు. పార్టీ మండలాధ్యక్షుడిగా, జిల్లా కార్యదర్శిగా మంగిశెట్టి కోటేశ్వరరావు అమూల్యమైన సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా శాలువా కప్పి ఆయనను సత్కరించారు. తనను గుర్తించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమిం చినందుకు మంగిశెట్టి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. షేక్ హష్మీ, భవిరిశెట్టి హనుమంతరావు, మంగిశెట్టి శ్రీనివాసరావు, నాయుడు రాంబాబు, మునగోడు సర్పంచ్ విష్ణు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, వెంపా వాసు, నందూరి కరుణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుపతమ్మ తల్లి గ్రామోత్సవం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ, వెంకటాయపాలెం గ్రామాల్లో శుక్రవారం శ్రీ లక్ష్మీతిరుపతమ్మ గ్రామోత్సవ భక్తులు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మాలధారణ చేపట్టిన దీక్షా స్వాములు సోమవారం పెనుగంచిప్రోలుకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఇరుముడులు కట్టుకునేందుకు వారి ఇళ్ల నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. మేళతాళాలతో కుంకుమ బండ్లను, ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో అమ్మవారి ప్రతిమలను ఏర్పాటు చేసి ఊరేగింపు నిర్వహించారు. అదే విధంగా గ్రామంలోని వెంకటాయపాలెం సుగాలీ కాలనీకి చెందిన స్వాములు కూడా అమ్మవారిని ఊరేగించారు. భక్తులకు అన్న సంతర్పణచేశారు. ఇరుముడులు కట్టుకుని అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు.

కాపులకు అన్ని విధాలా మేలు

ఎమ్మెల్యే శంకరరావుపై విమర్శలను ఖండించిన వైఎస్సార్ సీపీ కాపు నాయకులు



అచ్చంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కాపు నాయకులు

క్రోసూరు/అచ్చంపేట: కాపులకు అన్ని విధాలుగా మేలు చేసిన ఏకైన నాయకుడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాత్రమేనని, ఆయన విమర్శలు మానుకోవాలని వైఎస్సార్సీపీ కాపు నాయకులు అన్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ, కాపుకార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసిన లేళ్ల వెంకట్రావు ఎమ్మెల్యే నంబూరుశంకరరావుపై చేసిన విమర్శలను క్రోసూరు, అచ్చంపేట మండలాల కాపు నాయకులు శనివారం ఖండించారు. ఆయా మండలాల పార్టీ కార్యాలయాల్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. క్రోసూరు పార్టీ అధ్యక్షుడు వెలది అప్పారావు మాట్లాడుతూ పెదకూరపాడు నియోజకవర్గంలో కాపు సామాజిక వర్గానికి అనేక విధాలుగా మేలు చేసింది ఒకే ఒక్క నాయకుడు ఎమ్మెల్యే నంబూరుశంకరరావు అని అన్నారు. అమరావతి నుంచి వెంపా జాలయ్యను యార్డు చైర్మన్ చేశారని గుర్తుచేశారు. ఆఖరికి క్రోసూరు సొసైటీ అధ్యక్షుడిగా, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి ఎంత పోటీ ఉన్నప్పటికీ లేళ్ల వెంకట్రావును పదవి అప్పగించినా.. ఆయన కాపులకు ఉపయోగపడింది లేదన్నారు. అమరావతి పార్టీ అధ్యక్షుడిగా భవిరిసెట్టిహనుమంతరావు, క్రోసూరు అధ్యక్షుడుగా తనను, అచ్చంపేట సొసైటీ అధ్యక్షుడుగా రంగయ్యను, అచ్చంపేట మేజరు పంచాయతీ సర్పంచ్‌గా పదవిని వీరబాబు, బెల్లంకొండ మండలం సొసైటీ అధ్యక్షుడుగా భద్రయ్యలకు పదవులు కలిపించారన్నారు. ఇంత చేసిన ఎమ్మెల్యే నంబూరుశంకరరావుపై నీవు కాపులకు అన్యాయం జరిగిందని, కాపులపై కేసులు పెడుతున్నారని విమర్శించడం దుర్మార్గమన్నారు. అచ్చంపేట సర్పంచ్ కాంబాల వీరబాబు మాట్లాడుతూ 1,200 మంది కాపు ఓటర్లున్న అచ్చంపేట పంచాయతీ చరిత్రలో కాపులకు సర్పంచ్ పదవి దక్కలేదని, నాలుగు సార్లు నియోజకవర్గాని ప్రాతినిధ్యం వహించిన కన్నా లక్ష్మీనారాయణ కూడా కాపులను చిన్న చూపే చూశారన్నారు. ఎమ్మెల్యే శంకరరావు వచ్చిన తర్వాతనే మొదటి సారిగా కాపునకు సర్పంచ్ పదవి దక్కిందన్నారు.ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ పి.కోటయ్య , పార్టీ కాపు నాయకులు తోకల వెంకట్రావు, లేళ్ల పున్నారావు, శాఖమూరి, సొసైటీ అధ్యక్షుడు రామిశెట్టి రంగయ్య, చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీకృష్ణానాయక్, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు, సొసైటీ మాజీ చైర్మన్ రామిశెట్టి యల్లమందయ్య, పుట్లగూడెం సర్పంచ్ తోట పాపారావు, గాదె వీరాంజనేయులు పాల్గొన్నారు.

భ్రూణ హత్యల నివారణపై అవగాహన

పెదకూరపాడు స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రెండో రోజు భ్రూణ హత్యలు, బాల్య వివాహాలు, బాలికల అక్రమ రవాణాపై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య మాట్లాడుతూ మహిళలు బాలికల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక చట్టాలు తీసుకొచ్చారన్నారు. ఆడపిల్లలను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దిశ చట్టంలో మహిళలకు పూర్తి రక్షణ కల్పించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, సీడీపీఓ స్వర్ణ, సూపర్‌వైజర్ షేక్‌మున్ని పాల్గొన్నారు.

ప్రణాళికతో ముందుకు సాగాలి



పెదకూరపాడు: ప్రతి విద్యార్థి ప్రణాళిక, ఏకాగ్రత, పట్టుదల ఉంటే ఉన్నత శిఖరాలకు చేరుతారని జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి అన్నారు. గారపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు స్థానిక జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వర్ణకుమారి మాట్లాడుతూ కరోనాతో విద్యా వ్యవస్థ దెబ్బతిన్నప్పటికీ, ప్రభుత్వం ప్రతి విద్యార్థికి తోడ్పాటునందించిందన్నారు. మరో అతిథి ఎస్సై విప్పర్ల వెంకట్రావు మాట్లాడుతూ విద్యతోనే ఏదైనా సాధ్యమవుతోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు కంకణాల శివాజీ, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కె.వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ జి.మాధరావు, జనచైతన్య సమితి నిర్వాహకులు అనిలకుమార్, దాసరి విజయ్‌బెన్నిబాబు, అన్నవరపు స్టాలిన్‌బాబు పాల్గొన్నారు.

నేడు ఓర్వకల్లు గంగమ్మతల్లి తిరునాళ్ల

ఏర్పాట్లు చేసిన అధికారులు



భక్తులు అమితంగా విశ్వసించే గంగమ్మతల్లి

అచ్చంపేట: మండలంలోని ఓర్వకల్లులో స్వయంభుగా వెలసిన గంగాదేవి పేరంటాళ్లమ్మ తిరునాళ్ల శనివారం నిర్వహించేందుకు నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. ప్రతి ఏటా మాఘ శుద్ధి పౌర్ణమిన అమ్మవారి తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలో జరిగే అతి పెద్ద తిరునాళ్లలో ఇదీ ఒకటి. మూడు గ్రామాలు ఓర్వకల్లు, రుద్రవరం, గ్రంధశిరిలో తిరునాళ్ల మహోత్సవాలు జరుగుతాయి. అమ్మవారిని కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, పాడిపంటలకు ఇలవేల్పుగా, సంతాన లక్ష్మిగా ఈ ప్రాంత ప్రజలు కొలుస్తారు.

గంగమ్మతల్లి విశిష్టత

సుమారు వెయ్యి సంవత్సరాల క్రితం ఓర్వకల్లు గ్రామంలోని 150 అడుగుల ఎతైన కొండ గుహలో గంగమ్మతల్లి వెలసినట్లు చరిత్రకారులు చెబుతున్నారు. విజయవాడ కనకదుర్గమ్మతల్లికి ఎంతటి ప్రాముఖ్యత ఉందో.. ఓర్వకల్లు గంగమ్మతల్లికి కూడా అంతే ప్రాముఖ్యత ఉన్నదని భక్తులు విశ్వాసం. అమ్మవారికి భక్తితో పూజలు నిర్వహించి, నిష్టతో దర్శంచుకుని, కోర్కెలు కోరుకుంటే నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ముఖ్యంగా సంతానం లేని దంపతులు అమ్మవారిని దర్శించుకుని ఒక రోజు ఆలయ ప్రాంగణంలో నిద్ర చేస్తే వారి కోరిక తప్పక నెరవేరుతుందని విశ్వాసం.

ప్రత్యేక పూజలు

అమ్మవారికి ఉదయాన్నే ప్రత్యేక పూజలు జరుగుతాయి. అమ్మవారి దర్శనం, ముద్రపూలు ఉత్సవాలు, జనివాడ చదరంగం, గంగవేషం, శిడిమాను ఉరేగింపులు, పోలేరు, కల్లిపాటు, దీనబరారు నిర్వహిస్తారు. తలనీలాలకు, దర్శనం టిక్కెట్లు, ప్రసాదాల, అమ్మవారికి సమర్పించే నూతన వస్త్రాలు, కొబ్బరికాయల విక్రయాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గాదె రామకోటిరెడ్డి తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు



ఎర్త్‌మూవర్‌తో మొక్కలు తొలగింపు

బెల్లంకొండ: వన్నాయపాలెం గ్రామంలో పొలాలకు వెళ్లే రోడ్డు గుంతలు ఏర్పడి, కంప చెట్లు పెరిగడంతో మూసుకుపోయింది. గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు సమస్యను వివరించారు. బుధవారం ఎమ్మెల్యే సొంత నిధులతో ఎన్ఎస్ఆర్ ఫౌండేషన్ ద్వారా గ్రామంలోని పొలాలకు వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. గ్రామంలోని నల్లేరు డొంక, కొత్తపాలెం, బెల్లంకొండ వైపు వెళ్లే పొలాల రోడ్లకు మరమ్మతులు ప్రారంభించారు. ఎమ్మెల్యేకు సర్పంచ్ మేకల త్రివేణి, నాయకులు సోమయ్య, వెంకటేశ్వర్లు, వెంకటస్వామి గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

దమ్మాలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

దమ్మాలపాడు(ముప్పాళ్ళ): దమ్మాలపాడు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 429 మందికి వైద్య సేవలందించినట్లు ఇన్‌చార్జ్ వైద్యులు నజీర్ తెలిపారు. వైద్యులు హర్ష, శ్రావణి వైద్య సేవలందించారు. 38 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ కె.ఏడుకొండలు, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కళ్ళం శివరామిరెడ్డి, సీహెచ్‌ఓ అంజనేయులు, హెల్త్ సూపర్‌వైజర్లు ఎ.పీటర్‌డేమియన్, ఎంఎల్‌హెచ్‌పీలు ఎస్.కె.రహిమున్నిసా, అంజలి, మధు, ఏఎన్‌ఎంలు మస్తాన్‌బి తదితరులు పాల్గొన్నారు.

చౌటపాపాయపాలెంలో వైద్య శిబిరం

రాజుపాలెం: పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వెంకట కృష్ణకుమార్ చౌటపాపాయపాలెం సచివాలయం పరిధిలోని జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. 226మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వల్లాల నాగరాజు, సచివాలయం, పీహెచ్‌సీ సిబ్బంది శ్రీనాథ్, జీవనరావు, హన్నా కుమారి, లక్ష్మీదుర్గ, ప్రమీలాబాయ్ పాల్గొన్నారు.

ఉత్తమ వైద్య సేవలందించిన లక్ష్మీరాజ్యం



లక్ష్మీరాజ్యాన్ని సత్కరిస్తున్న వైద్య సిబ్బంది

పెదకూరపాడు: పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్‌నర్సుగా ప్రజలకు వైద్య సేవలు అందించిన లక్ష్మీరాజ్యం ప్రజల హృదయాల్లో నిలిచిపోతారని సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ రవివర్మ అన్నారు. గుంటూరు జీజీహెచ్‌కు బదిలీపై వెళ్తున్న రాజ్యంను శుక్రవారం ఘనంగా సత్కరించారు. డాక్టర్ రవివర్మ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు. ప్రజలకు వైద్య సేవలు అందిస్తే వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. లక్ష్మీరాజ్యం దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్‌నాయక్, డాక్టర్ చైతన్య, డాక్టర్ నీరజ్, డాక్టర్‌విద్య, డాక్టర్ రమేష్, స్టాఫ్‌నర్సులు విజయ, భాగ్యమ్మ, శ్రీలక్ష్మి, ప్రియాంక, వినయకుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీగోపయ్య శ్రీలక్ష్మీతిరుపతమ్మ కల్యాణ మహోత్సవం శుక్రవారం భవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. కల్యాణ వేడుకలో దంపతులు పాల్గొన్నారు. అన్న సంతర్పణ చేశారు.

వరిలో అగ్గి తెగులు నివారణకు చర్యలు

నకరికల్లు: వరిలో అగ్గి తెగులు అరికట్టేందుకు సత్వరమే నివారణా చర్యలు చేపట్టాలని రైతు శిక్షణా కేంద్రం డీడీఏ ఎం.శివకుమారి సూచించారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బోర్లు, బావుల ద్వారా సాగులో ఉన్న వరిపైరును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరిలో ఆకులపై సన్నని గోధుమ రంగులో మచ్చలు ఏర్పడి క్రమంగా పెద్దవై నూలు కండె ఆకారాన్ని సంతరించుకుంటాయన్నారు. నివారణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయసహాయకుడు ఎం.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.